క్లుప్తంగా

నూతన ఆలయాలకు శంకుస్థాపన

వెల్లంకి(వీరులపాడు):మండలంలోని వెల్లంకి గ్రామంలో నూతన ఆలయాల నిర్మాణ పనులకు ఆదివారం గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని బొడ్డురాయి, ముత్యాలమ్మ, గంటలమ్మ, వినాయకుని ఆలయాలకు నూతన ఆలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ హుసేన్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరీ, నాయకులు వేమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, నూతన ఆలయాల నిర్మాణ కమిటీ సభ్యులు వెంకటరామిరెడ్డి, ఎర్రమరెడ్డి వెంకటేశ్వరరావు, తల్లపురెడ్డి గురవారెడ్డి, డాక్టర్ ప్రసాద్, త్రినాద్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోక శాంతి కోసం ప్రత్యేక హోమాలు



నందిగామ:పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మాఘ పౌర్ణమి నేపథ్యంలో ఆదివారం స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శుక శ్యామలాంబ అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. లోక శాంతిని కాంక్షిస్తూ ఆలయంలోని యాగశాలలో స్థానాచార్యులు ముదిగొండ బాల శశాంక మౌళి, ఆలయ పురోహితులు సన్నిధానం వెంకట హనుమ కిషోర్ శర్మ పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు



నందిగామ:ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు జాతీయస్థాయిలో ఉపకార వేతనాలు అందించేందుకు నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్.ఎం.ఎం.ఎస్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. డివిజన్ పరిధిలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు నందిగామ పట్టణంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలో మొత్తం 835 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 796 మంది హాజరయ్యారని, 39 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల , శ్రీవిద్య పాఠశాల, నారాయణ పాఠశాల, శ్రీ చైతన్య పాఠశాలలలో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

కంచికచర్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి దగ్ధమైన ఘటన మండల కేంద్రంలోని హనుమాన్‌పేటలో ఆదివారం చోటుచేసుకుంది. ఫైర్ అధికారి పూర్ణచంద్రరావు కథనం మేరకు.... పెద్దినీడి శివపార్వతి అనే మహిళ పనుల నిమిత్తం బయటకు వెళ్లిందన్నారు. పిల్లలు బయట ఆడుకుంటుండగా ఇంట్లో నుంచి ఒక్కసారిగా పెద్ద మంటలు బయటకు వచ్చాయని తెలిపారు. గమనించిన స్థానికులు తమ సిబ్బందికి సమాచారం అందించామని పేర్కొన్నారు. దీంతో హుటాహుటిన ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నామన్నారు. తలుపులు తెరిచి ఇంట్లో నుంచి వస్తున్న మంటలను ఫైర్ ఇంజిన్ సాయంతో ఆర్పివేశామన్నారు. అప్పటికే డబుల్‌కాట్ మంచం, ఇనుప బీరువా, దుస్తులు, వంట సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఆస్తి నష్టం రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. ఫైర్ సిబ్బంది సుభాని, తాజుద్దీన్, సంజయ్‌వర్మ, శ్రీనివాసరావు తదితరులున్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

కంచికచర్ల :ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీల ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.

నేడు స్పందన కార్యక్రమం

నందిగామ:స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలోని సమస్యలను అర్జీల రూపంలో ఆర్డీఓ కార్యాలయంలో అందజేయవచ్చన్నారు.

వైభవంగా ప్రారంభమైన తిరునాళ్ల

- స్వాములతో ఎరుపెక్కిన పెనుగంచిప్రోలు
- దీక్షా స్వాముల తిరుముడి సమర్పణతో ఉత్సవాలు మొదలు
- శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి తరలివచ్చిన భక్తజనం



అమ్మవారికి పట్టువస్త్రాలు తెస్తున్న ఉదయభాను దంపతులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గం. 6.04 నిముషాలకు ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో అఖండజ్యోతి స్థాపన, ప్రత్యేక పూజలు అనంతరం దీక్షా స్వాముల తిరుముడి సమర్పణతో ఉత్సవాలు మొదలయ్యాయి. శ్రీస్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు మర్రెబోయిన వెంకటరమణ దీక్షాస్వాములకు తిరుముడి కట్టారు. తిరుముడి కట్టుకున్న స్వాములు అమ్మ భజనలతో, శరణుఘోషతో అమ్మవారిని దర్శించుకొని తిరుముడి సమర్పించి హోమగుండంలో తిరుముడిలోని ముద్దర టెంకాయలోని నెయ్యిని సమర్పించారు. మునేరు అవతల అమ్మవారి ఆలయానికి చెందిన ఆడిటోరియం స్థలంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఈఓ, చైర్మన్, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, జగ్గయ్యపేట సీఐ ఎ.నాగమురళి, ఎస్‌ఐలు హరిప్రసాద్, రామారావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, కురువెళ్ల రాయప్ప, ఈఈ వైకుంఠరావు ప్రారంభించారు.

తెల్లవారు జామునుంచే..

తెల్లవారు జామునుంచి భక్తులు మునేరులో స్నానమాచరించి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థాన ఆవరణలో పోలీస్, రెవెన్యూ, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందిస్తున్నారు. దీక్షా స్వాములకు పలు స్వచ్ఛంద సంస్థల వారు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఆలయం తరపున స్వాములకు నిరంతరాయంగా నీరు పంపిణీ చేశారు. గ్రామంలో పంచాయతీ సిబ్బంది, ఆలయం వద్ద ఆలయ సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. రాజగోపురం వద్ద తిరుముడి సమర్పణకు భక్తులు బారులు తీరి అమ్మ దర్శనానికి ఉరక లేశారు.

ఎరుపెక్కిన పెనుగంచిప్రోలు..

శ్రీతిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లలో భాగంగా శ్రీతిరుపతాంబ దీక్ష చేపట్టిన వేలాది మంది స్వాములు తిరుముడి సమర్పించేందుకు తరలి రావటంతో ఆదివారం పెనుగంచిప్రోలు ఎరుపెక్కింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన స్వాములు మునేరు, మామిడి తోటలు, ఆలయాల్లో సేద తీరారు. తలపై ఇరుముడి పెట్టుకొని డప్పు వాయిద్యాలకు అనుగుణంగా చిందేశారు. మహిళలు పొంగళ్లతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందిగామ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ నాగమురళి పర్యవేక్షణలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమనీయం..కల్యాణోత్సవం..

విద్యుత్ దీప కాంతులతో శోభిల్లుతున్న ఆలయ ప్రాంగణం బయట ప్రత్యేకంగా ఖమ్మంకు చెందిన కళాకారులు నిర్మించిన బంగారు ఛాయ కలిగిన మండపంలో వేద మంత్రోచ్ఛరణల సాక్షిగా గోపయ్య తిరుపతమ్మ కల్యాణ ఘట్టం కమనీయంగా సాగింది. కల్యాణాన్ని చూసేందుకు వీలుగా భారీ స్క్రీన్‌లతో పాటు, భక్తి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. కల్యాణానికి వ్యాఖ్యాతగా తెనాలికి చెందిన నోరి కోదండరామ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, రవికుమార్ దంపతులు, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి దంపతులు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఆలయ ఈఈ వైకుంఠరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ధర్మకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



బైక్‌పై ప్రభల అలంకరణలో తెలంగాణ నుంచి దీక్ష విరమణకు వస్తున్న మాలధారి



చిందులు వేస్తూ వస్తున్న దీక్షాస్వాములు



తిరుముడితో దీక్ష విరమించేందుకు వచ్చిన చిన్నారి



హోమగుండం వెలిగిస్తున్న కార్యక్రమంలో ఆలయ ఈఓ, చైర్మన్, పాలకవర్గ సభ్యులు

విమర్శలు హుందాగా ఉండాలి



మాట్లాడుతున్న నాయకులు

నందిగామ టౌన్:రాజకీయాల్లో విమర్శలు హుందాగా ఉండాలి కానీ దిగజారుడుతనానికి నిదర్శనంగా ఉండకూడదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తంగిరాల ప్రభాకరరావు మృతి చెందితే అడ్డదారిలో ఎమ్మెల్యే అయిన సౌమ్యకు ప్రజల ఆశీస్సులతో విజయం సాధించిన శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. టీడీపీ హయాంలోనే కొండలు, గుట్టలు తరుక్కుపోయాయని.. మీ కనుసన్నల్లో టీడీపీ నేతలే బొక్కేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఎవరైనా ఎలాగైనా దోచుకోండి నాకు మాత్రం ఇళ్లు, పొలాలు కానుకలుగా అందించండి అని అడుక్కున్న చరిత్రను సొంతం చేసుకున్న తంగిరాల సౌమ్య అవినీతి రహిత పాలన అందిస్తున్న ఎమ్మెల్యే సోదరులను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని దుయ్యబట్టారు. స్థాయి మరిచి సౌమ్య చేస్తున్న దిగజారుడు విమర్శలకు నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా దిగజారుడు రాజకీయాలు మానుకుని హుందాగా నడుచుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు చిరుమామిళ్ల చైతన్య కుమార్, వైఎస్ఎన్ ప్రసాద్, పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. నెల్లూరుకు చెందిన పెనుబర్తి కామాక్షి బృందానికి చెందిన శాన్వి, వినూత్న, శ్రీనిత్య, మమత, హర్షిత, వినంబ్ర, స్వాతితో పాటు పలువురు కళాకారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఏకదంతాయ.. వక్రతుండాయ..., భామా కలాపం, అష్టలక్ష్మీస్తోత్రం, అర్ధనారీశ్వర స్తోత్రంతో పాటు పలు కీర్తనలకు చక్కటి అభినయంతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు దేవస్థాన అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

స్విమ్మింగ్ పోటీల్లో పతకాల పంట

- ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహణ
- జగ్గయ్యపేట ప్రాంత డ్రీమర్స్, స్విమ్మర్స్ అసోసియేషన్స్ ప్రతిభ
- 16 స్వర్ణం, 13 రజిత, ఒక కాంస్య పతకం సాధన



మాస్టర్స్ గేమ్స్, స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన పేట స్విమ్మర్లు

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 4న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 5వ ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్, ఈతల పోటీలలో జగ్గయ్యపేట ప్రాంత డ్రీమర్స్, స్విమ్మర్స్ అసోసియేషన్స్ స్విమ్మర్లు 10 మంది ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి 30 పతకాలు సాధించారు. పేట ప్రాంతానికి చెందిన పురుషులు, మహిళలు కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు సారధ్యంలో ఈ పోటీల్లో పాల్గొని మొత్తం 30 పతకాలతో విజయదుందుభి మోగించారు.

వాటిలో 16 స్వర్ణం, 13 రజిత, ఒక కాంశ్య పతకం సాధించినట్లు స్విమ్మర్స్ కోచ్ పొట్టాబత్తిన పాండు రంగారావు ఆదివారం విజేతల వివరాలను తెలిపారు.

మహిళల విభాగంలో..

- పొట్టాబత్తిన లక్ష్మి-బ్రెస్ట్ స్ట్రోక్ 100 మీటర్స్, గోల్డ్ బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్స్ గోల్డ్, ఫ్రీ స్టైల్ 50 మీటర్స్ గోల్డ్
- ఏనుగుల సీతారావమ్మ-బటర్ ఫ్లై 100 మీటర్స్ గోల్డ్, బటర్ ఫ్లై 50 మీటర్స్ గోల్డ్, బ్రెక్ స్ట్రోక్ 50 మీటర్స్ సిల్వర్
- ఎస్.ఆదిలక్ష్మి-బ్యాక్ స్ట్రోక్ 100 మీటర్స్ సిల్వర్, బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్ గోల్డ్, బ్రెస్ట్ 50 మీటర్స్ గోల్డ్
- పి.రమాదేవి-బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్ గోల్డ్, బటర్ ఫ్లై 50 మీటర్స్ గోల్డ్, బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్స్ గోల్డ్
- వై.ఉషారాణి-బ్యాక్ స్ట్రోక్ 100 మీటర్స్ సిల్వర్, బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్ గోల్డ్, బటర్ ఫ్లై 50 మీటర్స్ సిల్వర్

పురుషుల విభాగంలో...

- మోహన్‌బాబు-ఫ్రీ స్టైల్ 400 మీటర్స్ గోల్డ్, ఐఎం 200 మీటర్స్ సిల్వర్, బటర్ ఫ్లై 50 మీటర్స్ గోల్డ్
- సీహెచ్.మోహనరావు-బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్స్ సిల్వర్, బటర్ ఫ్లై 50 మీటర్స్ సిల్వర్, ఫ్రీ స్టైల్ 50 మీటర్స్ సిల్వర్
- వి.రామచంద్రనాయక్-బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్స్ సిల్వర్, బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్ కాంస్య, బటర్ ఫ్లై 50 మీటర్స్ సిల్వర్
- జి.శ్రీనివాస్-బ్రెస్ట్ స్ట్రోక్ 100 మీటర్స్ సిల్వర్, బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్స్ సిల్వర్, ఫ్రీ స్టైల్ 50 మీటర్స్ గోల్డ్
- ఆర్.సత్యనారాయణ-బటర్ ఫ్లై 100 మీటర్స్ గోల్డ్, ఐఎం 200 మీటర్స్ సిల్వర్, ఫ్రీ స్టైల్ 400 మీటర్స్ గోల్డ్ సాధించారు.

వీరిని అసోసియేషన్ అధ్యక్షుడు మండవు శ్రీనివాసరావు, సెక్రటరీ కలాలి నరేష్, టీమ్ మేనేజర్ ఎ.కల్యాణ్, కన్వీనర్ యలదండి శ్రీనివాసరావు, కృష్ణా స్విమ్మర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కిషోర్‌బాబు, పూర్వ అధ్యక్షుడు చెరుకూరి రమేష్, రాటకొండ శ్రీనివాస్, అల్లి శ్రీనివాస్, కుర్ర శ్రీనివాసరావు, అప్పన అయ్యప్ప తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్:ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని రాఘవాపురం గ్రామంలో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజల ముంగిటకు పాలన తెచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు.

వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. దేశానికే ఆదర్శవంతమైన వలంటీర్, సచివాలయ వ్యవస్థలను రూపొందించి ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనే కాదు ఏ ఎన్నికల్లోనైనా జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించారన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ పెసరమల్లి సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, నాయకులు స్టాలిన్, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్టా మహోత్సవాలు





ప్రతిష్టా మహోత్సవాలలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) పాల్గొన్న నందిగామ ఎమ్మెల్యే

నందిగామ:పట్టణంలోని రామలింగేశ్వరనగర్‌లో గల సాయి అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. అయ్యప్ప ఆలయ ప్రాంగణంలోని గణపతి ఆలయం వద్ద జీవ ధ్వజస్తంభం, నవ నాగులు, ఐదడుగుల శనైశ్చర విగ్రహం, అభయాంజనేయ స్వామి వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితుల మంత్రాల నడుమ ఉదయం 9.06 గంటలకు యంత్రస్థాపన, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జేష్టా దేవి సమేత శనైశ్చర స్వామి, సువర్చల సమేత ఆంజనేయ స్వామి, వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవాలకు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

రేపటి నుంచి ప్రతిష్టా మహోత్సవాలు

పెద్దాపురం(వీరులపాడు):మండలంలోని పెద్దాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దాసాంజనేయ స్వామి వారి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలను ఈ నెల ఏడు నుంచి 10 వరకు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆవుల రమేష్‌బాబులు తెలిపారు. ప్రతిష్టా మహోత్సవాల సందర్భంగా నాలుగు రోజుల పాటు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాది క్రతువులు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 10న ప్రతిష్టా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ప్రముఖ ప్రవచనకర్త, టీటీడీ ధార్మిక కార్యక్రమాల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే ప్రవచన కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌తో కలిసి చాగంటిని స్వయంగా ఆహ్వానించినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ప్రతిష్టా మహోత్సవాలకు సిద్ధమైన దాసాంజనేయ స్వామి ఆలయం



చాగంటికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, నాయకులు

అలరించిన నాటికలు

మైలవరం: స్థానిక ద్వారకా తిరుమల దత్తత దేవాలయం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి తిరు కల్యాణ మహోత్సవం ప్రారంభమైంది. శ్రీస్వామివారి తిరు కల్యాణాన్ని ఆలయ ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకర రావు ప్రారంభించారు. శ్రీతిరుకల్యాణ మహోత్సవంలో భాగంగా మైలవరం శ్రీబాల భారతీ నాట్య మండలి నిర్వహణలో నాటకోత్సవాలను నటరాజ పూజతో జ్యోతి ప్రజ్వలన చేసి జమీందారు తనయుడు ఎస్వీ నివృతరావు ప్రారంభించారు. మొదటి రోజు మొదటి ప్రదర్శన జనచైతన్య, ఒంగోలు వారి చేతిరాత నాటిక ప్రదర్శించారు.

క్యాన్సర్ కారక జీన్స్‌ను ముందే గుర్తించవచ్చు

ప్రముఖ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రవికిరణ్



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ బొబ్బా రవికిరణ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్‌కు కారకమైన జన్యువుల గురించి ఆధునిక వైద్యశాస్త్రం చాలా వరకూ కనుగొన్నదని ప్రముఖ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ బి.రవికిరణ్ అన్నారు. ఇప్పుడు జీన్స్ పరీక్ష ద్వారా క్యాన్సర్ కారక జన్యువులను ముందే గుర్తించవచ్చని ఆయన పేర్కొన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య నర్సింగ్‌హోంలో జెనిటిక్స్ క్యాన్సర్ అనే అంశంపై ఆదివారం ఆరోగ్య సదస్సు జరిగింది.

ఈ సదస్సులో డాక్టర్ బి.రవికిరణ్ మాట్లాడుతూ కొందరిలో క్యాన్సర్ వంశపారంపర్యంగా సంక్రమిస్తుందన్నారు. క్యాన్సర్‌కు కారకమైన జన్యువులు కొన్ని వంశపారంపర్యంగా సంక్రమించగా, కొన్ని రసాయనాలకు, అల్ట్రావైలెట్ రేడియోషన్‌కి వ్యక్తి గురి కావడంతో కూడా తయారవుతున్నాయన్నారు. కొన్ని క్యాన్సర్ జీన్స్ బలహీనమైనవి కాగా, మరికొన్ని బలీయమైనవి అవుతాయన్నారు. బలీయమైన జీన్స్ ఉన్నప్పుడు వ్యాధి బహిర్గతం అవుతుందన్నారు. ఒక వ్యక్తి రసాయనాలకు గురి అయినప్పుడు అంతవరకు ఆరోగ్యకరంగా ఉన్న జీన్స్ పరివర్తన చెందిన క్యాన్సర్ కారకంగా మారతాయన్నారు. దాని వలన ఇబ్బందికరమైన ఎప్లాస్టిక్ ఎనీమియా, హార్ట్‌కిన్స్ డిసీజ్, బ్లడ్ క్యాన్సర్, ఇతర వ్యాధులు కలుగుతాయని డాక్టర్ రవికిరణ్ పేర్కొన్నారు.

స్మోకింగ్, ఆల్కాహాల్, స్థూలకాయం ఏ విధంగా శారీరక శ్రమలేక పోవడం, పోషకాహారం లోపం , ఎండకు అతిగా గురికావడం వంటి వాటితో శరీరంలోని జీన్స్ పరివర్తన చెంది క్యాన్సర్‌ను కలిగించవచ్చని పేర్కొన్నారు. క్యాన్సర్ రావడానికి అవకాశం ఉన్న వ్యక్తుల్లో జీన్స్ పరీక్ష ద్వారా ముందే గుర్తించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ మారు పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు

నందిగామ: పట్టణ శివారు పల్లగిరి గుట్టపై గల త్రిశక్తి పీఠంలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమం నిర్వహించారు. మాఘ పౌర్ణమి నేపథ్యంలో ఆలయంలోని కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు.